సాయికిరణ్‌ను ఓదార్చుతున్న నాయకులు, అధికారులు

తల్లిదండ్రులు లేరని తల్లడిల్లిన విద్యార్థి

ఓదెల, డిసెంబర్ 14: తనకు తల్లిదండ్రులు లేరని ఓ విద్యార్థి తల్లడిల్లిన తీరు అక్కడున్న వారి హృదయాలను కదిలించింది. ఓదెల బీసీ హాస్టల్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. విద్యార్థుల తల్లిదండ్రులతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. అధికారులతో పాటు పలువురు నాయకులు కూడా హాజరయ్యారు. తల్లిదండ్రుల సమావేశం సందర్భంగా పిల్లలందరి పేరెంట్స్ వచ్చారు. కాగా ఆరో తరగతి విద్యార్థి నాగుల మల్యాల సాయి కిరణ్ తల్లిదండ్రులు తన చిన్నతనంలోనే చనిపోయారు. అతని పెద్దమ్మ, పెద్ద నాన్న ప్రమీలా-శంకర్ చేరదీశారు. ప్రస్తుతం ఓదెల బీసీ హాస్టల్‌లో ఉంటూ మోడల్ స్కూల్‌లో చదువుకుంటున్నాడు. శనివారం హాస్టల్‌లో మీటింగ్‌కు అందరి తల్లిదండ్రులు వచ్చి తమ పిల్లలతో గడిపారు. సాయి కిరణ్ మాత్రం తనకు తల్లిదండ్రులు లేకపోవడంతో ఓ మూలన కూర్చుండి ఏడుస్తుండగా తోటి విద్యార్థి గమనించి ఉపాధ్యాయులకు తెలిపాడు. వెంటనే వారు అక్కడి వెళ్లి చూశారు. విద్యార్థి పరిస్థితిని తెలుసుకొని చలించిపోయారు. ఆ విద్యార్థిని హత్తుకొని ఓదార్చారు. ఏదైన అవసరముంటే తమను సంప్రదించాలని వార్డెన్‌కు సూచించారు. పద్మశాలి సంఘ నాయకుడు చీకట్ల మొండయ్య రూ.10వేలు ఆ విద్యార్థికి సాయమందించడానికి ముందుకు వచ్చాడు. హాస్టల్‌కు వచ్చిన మిగతా పిల్లల తల్లిదండ్రులను కూడా ఈ ఘటన తీవ్రంగా కలిచివేసింది. సాయి కిరణ్‌తో అందరు స్నేహంగా మెలగాలని తమ పిల్లలకు సూచించారు.

దీక్షలో పాల్గొన్న నాయకులు

కొనసాగుతున్న నిరవధిక దీక్ష

పెద్దపల్లి కమాన్, డిసెంబర్ 13 : సమగ్ర శిక్షా ఉద్యోగులు జిల్లా కేంద్రంలో చేస్తున్న నిరవధిక సమ్మె కొనసాగుతున్నది. ట్రస్మా రాష్ట్ర ముఖ్య సలహాదారుడు యాదగిరి శేఖర్‌రావు, డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సీహెచ్ రాజ్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్వరరావు, సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దక్షిణ గౌడ్ లింగం శ్రీనివాస్, రంజిత్‌కుమార్, సీహెచ్ పోచయ్య సందర్శించి, సమగ్ర శిక్షా ఉద్యోగులకు సంఘీభావాన్ని ప్రకటించారు. తిప్పని తిరుపతి, పుల్లూరి సంధ్యారాణి, రాజ్‌కుమార్, మల్లయ్య ఉన్నారు.

నేడు సమావేశం

గోదావరిఖని, డిసెంబర్ 14: భాస్కర్‌రావు భవన్‌లో సీపీఐ జనరల్ బాడీ సమావేశం ఆదివారం ఉంటుందని ఏఐటీయూసీ ఆర్జీ-1 బ్రాంచీ కార్యదర్శి ఆరెల్లి పోశం తెలిపారు. ఈ సమావేశానికి సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కలవేని శంకర్, జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం హాజరవుతారని పేర్కొన్నారు. ఏఐటీయూసీ ఆర్జీ-1 బ్రాంచీ ఆఫీస్ బేరర్స్, పిట్ కార్యదర్శులు, కార్మికులు హాజరు కావాలని కోరారు.

విద్యార్థుల సంక్షేమమే ధ్యేయం

ధర్మారం/సుల్తానాబాద్ రూరల్/ కాల్వశ్రీరాంపూర్/పెద్దపల్లి రూరల్/ మంథని/, డిసెంబర్14 : విద్యార్థుల సంక్షేమమే ధ్యేయమని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మల్లాపూర్, మేడారంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల విద్యాలయం, ధర్మారంలోని ఎస్టీ మినీ బాలికల గురుకుల విద్యాలయంలో కామన్ డైట్, మెనూ చార్జీల పెంపు కార్యక్రమాన్ని కలెక్టర్ కోయ శ్రీ హర్షతో కలిసి విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఆయా గురుకులాల ప్రిన్సిపాళ్లు దేవసేన, యుగేందర్ లక్ష్మి, శ్రీలత, మండల ప్రత్యేక అధికారి, డీపీవో వీరబుచ్చయ్య, తహసీల్దార్ ఎండీ ఆరిఫొద్దీన్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఏఎంసీ చైర్మన్ లావుడ్య రూప్లా నాయక్, మల్లాపూర్ గురుకుల విద్యాలయం పేరెంట్స్ కమిటీ చైర్మన్ శాతరాజుల సుమన్, సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి బాలికల గురుకుల విద్యాలయం, భూపతిపూర్‌లోని ఎంజేపీ గురుకుల పాఠశాలలో ఎమ్మెల్యే విజయరమణారావు ప్రారంభించారు.

ధర్మారం : విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

కాల్వశ్రీరాంపూర్‌లోని ఎస్సీ హాస్టల్‌లో తహసీల్దార్ వకీల్ కామన్ డైట్ మెనూను ప్రారంభించారు. పెద్దపల్లి మండలం రాఘవపూర్‌లో జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి, ఇంచార్జి మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రంగారెడ్డి ప్రారంభించారు. మంథని మున్సిపల్ పరిధి కూచిరాజ్‌పల్లి శివారులోని మైనార్టీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలో జిల్లా అదనపు కలెక్టర్ వేణు ప్రారంభించారు. మంథని ఎస్సీ రెసిడెన్షియల్ బాలికల వసతి గృహంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమా ప్రారంభించారు.

గురుకులంలో సందడి..

ధర్మారం మండలం మల్లాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల శనివారం సందడిగా కనిపించింది. రెండో శనివారం సెలవు కావడంతో తమ పిల్లలను చూడడానికి విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో వచ్చారు. రోజంతా పేరెంట్స్‌తో ఆనందంగా గడిపారు. తల్లలు తమ కూతుళ్లకు జడలు వేస్తూ కనిపించారు. తల్లిదదండ్రులు తమ పిల్లల యోగక్షేమాలు, చదువు వివరాలు తెలుసుకున్నారు.

ధర్మారం, డిసెంబర్ 14:

18న సింగరేణి మహిళలకు ఆటల పోటీలు

రామగిరి, డిసెంబర్ 14: సింగరేణి ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని ఆర్జీ-3, ఏపీఏ ఏరియాలో ఈనెల 18న సింగరేణి ఉద్యోగుల కుటుంబీలకు దీపాలంకరణ, ఆటల పోటీలు, ఉత్తమ పర్యావరణ హిత గృహాలంకరణ పోటీలు నిర్వహించనున్నుట్లు ఏరియా అధికార ప్రతినిధి సుదర్శనం తెలిపారు. వెల్ బేబీ షోలో పాల్గొనే వారు డిస్పెన్సరీ కార్యాలయంలో సంప్రదించి చిన్నారుల టీకాల కార్డుతోపాటు గుర్తింపు కార్డు అందజేసి నమోదు చేయించుకోవాలని కోరారు. ఈనెల 23న రాణీ రుద్రమదేవి స్టేడియంలో నిర్వహించనున్న ఆవిర్భావ వేడుకలకు హాజరు కావాలని కోరారు.

ఐకేపీలో అక్రమాలకు మంత్రి బాధ్యత వహించాలి

ఐకేపీ సెంటర్ వద్ద మాట్లాడుతున్న పూదరి సత్యం

రామగిరి, డిసెంబర్ 14: నాగెపల్లి ఐకేపీ కేంద్రంలో జరిగిన అక్రమాలకు మంత్రి శ్రీధర్‌బాబు బాధ్యత వహించాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణ గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం ధాన్యం కొనుగోలు కేంద్రంను బీఆర్ఎస్ నాయకులతో కలిసి సందర్శించి జరిగిన అవకతవకలకు సంబంధించి ట్రక్ షీట్లను, వే బిల్లులను పరిశీలించారు. కాంటాను ట్యాంపరింగ్ చేసి ఒక్కో బస్తాకు కిలో ఆరు వందల గ్రాముల వడ్లను దోచుకున్నట్లు నిర్ధారణ జరిగినా ఇప్పటివరకు చర్యలు చేపట్టలేదన్నారు. రైతులు నేరుగా దొంగతనాన్ని బయటపెట్టినా అధికారులు పట్టించుకోవడం లేదంటే ఇదంతా అధికార యంత్రాంగంకు తెలిసే జరిగి ఉంటుందన్నారు. కొనుగోలు కేంద్రాలను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని చెప్పిన మంత్రి శ్రీధర్‌బాబు ఇందుకు సమాధానం చెప్పాలన్నారు. రైతుల నుంచి సుమారు 200 క్వింటాళ్లకు పైగా ధాన్యం దోపిడీకి గురైనట్లు పలు పత్రికల్లో కథనాలు వచ్చినా అధికారులు స్పందించకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. మంత్రి మాటలు నమ్మి రైతులు నట్టేటా మోసపోయారన్నారు. దీన్ని బట్టి చూస్తే మంథని నియోజక వర్గం అంతటా ఇదే దోపిడీ జరిగి ఉంటుందన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు శెంకేసి రవీందర్, మేదరవేని కుమార్, మాజీ సర్పంచ్‌లు కొండవేన ఓదెలు, గాజుల ప్రసాద్, శంకర్ గౌడ్, కాపురవేన భాస్కర్, దామెర శ్రీనివాస్, ప్రభాకర్, సుధాకర్ ఉన్నారు.

ఓసీపీ-2లో వార్షిక భద్రత పక్షోత్సవాలు

బహుమతి అందజేస్తున్న అధికారులు

రామగిరి, డిసెంబర్ 14: సింగరేణి ఆర్జీ-3 ఓసీపీ-2లో శనివారం వార్షిక భద్రత పక్షోత్సవాలు నిర్వహించారు. భద్రతా తనిఖీ బృందం కన్వీనర్ బైద్య, సభ్యులు పర్యటించారు. ముందుగా ప్రాజెక్టు అధికారులు, ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు. అనంతరం సమావేశంలో తనిఖీ బృందం కన్వీనర్ బైద్య మాట్లాడారు. గతంలో జరిగిన ప్రమాదాలు, సంఘటనలను దృష్టిలో ఉంచుకొని మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గత ఏడాది భద్రత పక్షోత్సవాలలో సాధించిన బహుమతి (రోలింగ్ షీల్డ్)ను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ ట్రేడ్ టెస్టులలో విజేతలుగా నిలిచిన ఉద్యోగులకు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం కార్యక్రమంలో ఆర్జీ-3 జీఎం సుధాకర్ రావు, రీజియన్ సేఫ్టీ జీఎం గుప్తా, కార్మిక నాయకులు రామచంద్రారెడ్డి, కోట రవీందర్, పీఓ వెంకటరమణ, సేఫ్టీ ఆఫీసర్ రాంమ్మోహన్, ఇంజినీర్ చంద్రశేఖర్, మేనేజర్ రామారావు, సేఫ్టీ ఆఫీసర్ యాసిన్, తనిఖీ బృందం సభ్యులు షేక్ మిన్హాజుద్దీన్, వీరన్న, దయాకర్, ప్రసాద్, ఆదినారాయణ, మురళీకృష్ణ, మొహియొద్దీన్, సాధిక్, వెంకటేశ్వర్లు, కత్తుల రాజు, పిట్ సెక్రెటరీలు వెంకటస్వామి, మనోహర్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

పెద్దపల్లి టౌన్, డిసెంబర్ 14 : అసెంబ్లీ ఎన్నికల ముందు మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయలేదని, తమ డిమాండ్లను పరిష్కరించలేదని మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న మున్సిపల్ కార్మికులు విధులు బహిష్కరించి మున్సిపాలిటీల ముందు దీక్షలు చేయనున్నట్లు తెలిపారు. 19న చేపట్టనున్న చలో హైదరాబాద్‌కు కార్మికులు వేలాదిగా తరలిరావాలని కోరారు. ఇక్కడ నాయకులు ఆరెపల్లి చంద్రయ్య, వెంకటస్వామి, సాగర్, అన్వేష్, రాజయ్య, శంకర్, సుశీల, దేవమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలి

జ్యోతినగర్, డిసెంబర్ 14: ఎన్టీపీసీలో దళారుల దందాను ఆరికట్టి, స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఎన్టీపీసీలోని యూనియన్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన రామగుండం ఇండస్ట్రీయల్ వర్కర్స్ యూనియన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మిక సంఘాలతో ఎన్టీపీసీ యాజమాన్యం 2018లో చేసుకున్న ఒప్పందంలోని ప్రమోషన్ పాలసీ నేటికీ అమలు చేయడం లేదన్నారు. టెండర్ మారిన ప్రతీసారి గేట్‌పాస్ కోసం ఫిట్‌నెస్ పరీక్షతో కార్మికులను మానసిక క్షోభకు గురిచేయడం, 60 ఏళ్ల దాటిన వారికి ఎలాంటి రిటైర్‌మెంట్ బెనిఫిట్ లేకుండా తొలగించడాన్ని వీడాలని డిమాండ్ చేశారు. ఇక్కడ యూనియన్ ప్రధానకార్యదర్శి నాంపాని శంకర్, నాయకులు గీట్ల లక్ష్మారెడ్డి, డీ రాఘవరెడ్డి, ఎండీ యాకూబ్, కే మల్లేశ్, ఎండీ షమీమ్, శంకర్, కనకయ్య, పురుషోత్తం ఉన్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

అంతర్గాం, డిసెంబర్ 14: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు జిల్లా విద్యాధికారి మాధవి అన్నారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో కామన్ డైట్ ప్లాన్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గురుకులాల్లో చదివే ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారికి కావల్సిన సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తున్నదన్నారు. విద్యార్థుల డైట్ కాస్మొటిక్ చార్జీలను పెంచిందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి డీఈవో భోజనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలకు వృద్ధురాలి మృతదేహం

- గౌరవంగా స్వీకరించిన అనాటమీ విభాగం

కోల్‌సిటీ/ఫర్టిలైజర్ సిటీ, డిసెంబర్ 14: వైద్య విద్యార్థులకు ఉపయోగపడేలా ఓ వృద్ధురాలి మృతదేహాన్ని దానం చేసి సమాజంలో తమ బాధ్యతను చాటుకున్నారు. నగరంలోని ఈశ్వర కృప వృద్ధుల ఆశ్రమంలో లక్ష్మి (78) అనే కంటి చూపు లేని వృద్ధురాలు 11 నెలలుగా ఉంటున్నది. రోడ్డు పక్కన ఉన్న ఈ వృద్ధురాలిని గుర్తించిన పోలీసులు గత జనవరిలో ఈశ్వర కృప ఆశ్రమంలో చేర్పించారు. వృద్ధురాలిని ఆశ్రమ వ్యవస్థాపకుడు పీటీ స్వామి ఆమెను చేర్చుకున్నాడు. కాగా, వృద్ధురాలు శనివారం ఉదయం మృతి చెందింది. వృద్ధురాలి కోరిక మేరకు సదాశయ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మృతదేహాన్ని సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాలకు దానం చేశారు. ముందుగా వృద్ధురాలికి నివాళులర్పించారు. అనంతరం ప్రత్యేక అంబులెన్సులో వైద్య కళాశాలకు తీసుకవెళ్లగా అనాటమీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కల్పనకు అప్పగించారు. అక్కడ లక్ష్మి పార్థివ దేహానికి సదాశయ ఫౌండేషన్ బాధ్యులు లింగమూర్తి, రామకృష్ణారెడ్డి, కేఎస్ వాసు, చంద్రశేఖర్, ప్రొఫెసర్లు, వైద్య విద్యార్థులు గౌరవ వందనం చేసి నివాళులర్పించారు. వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం పార్థివ దేహాన్ని దానం చేయడానికి ముందుకు వచ్చి ఆ వృద్ధురాలి చివరి కోరిక నెరవేర్చిన ఆశ్రమ నిర్వాహకులు, ఫౌండేషన్ సభ్యులను అభినందించారు.

గౌరవ వందనం చేస్తున్న మెడికోలు, సిబ్బంది, స్వచ్ఛంద సంఘాల బాధ్యులు

యంత్రాలను పూర్తి స్థాయిలో వినియోగించాలి

యైటింక్లయిన్ కాలనీ, డిసెంబర్ 14: యంత్రాలను పూర్తి స్థాయిలో వినియోగించి నిర్దేశిత లక్ష్యాలను అధిగమించాలని మల్టీ డిపార్ట్‌మెంట్ కమిటీ కన్వీనర్ రఘుపతి అన్నారు. ఈమేరకు ఓసీపీ-1 గనిలో శనివారం మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంకిత భావం, సమష్టి కృషితో భద్రతతో విధులు నిర్వహిస్తూ లక్ష్యాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు శ్రీనివాస రావు, ఫైనాన్స్ ఏజీఎం శ్రీనివాసులు, డీజీఎం చంద్రశేఖర్, సుదర్శనం, పీవో రాజశేఖర్, ఇంజనీర్ ఉదయ్ భాస్కర్, కాశీ విశ్వేశ్వరరావు, సునీల్ ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఓసీపీ-3లో

ఓసీపీ-3 కృషి భవన్‌లో మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్జీ-2 జీఎం వెంకటయ్య మాట్లాడారు. 2024-25లో కంపెనీ ఉత్పత్తి, ఉత్పాదకత, బొగ్గు రవాణా, లక్ష్యాలు, భూగర్భ గనుల యంత్రాల వినియోగం, ఓసీపీలో భారీ యంత్రాల వినియోగం, సింగరేణిలో అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికలు, కంపెనీ సవాళ్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఉద్యోగులకు వివరించారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు రవీందర్, అధికారుల సంఘం అధ్యక్షుడు నర్సింహులు, పీవో మధుసూదన్, టీం సభ్యులు రాముడు, అనిల్‌కుమార్, మురళీకృష్ణ, తిరుపతి, గని మేనేజర్ భారత్‌కుమార్, ఇంజనీర్ రాజాజీ, సంక్షేమాధికారి రాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

కమాన్‌పూర్, డిసెంబర్ 14: ఆశ కార్యకర్తలకు రూ.18వేల వేతనం నిర్ణయించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర సమస్యలను పరిష్కరించాలని పని భారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు జాతా ఈనెల 17న జిల్లా కేంద్రానికి రానున్నది. జిల్లాలోని ఆశ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా కార్యదర్శి జ్యోతి కోరారు. ఈమేరకు బస్సు జాత పోస్టర్లను మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం విడుదల చేశారు. కార్యక్రమంలో అమృత, రమ, విజయ, గౌతమి, శ్యామల, లావణ్య, స్వప్న, కృష్ణవేణి, మల్లేశ్వరి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

జ్యోతినగర్, డిసెంబర్ 14: ఎన్టీపీసీ పోలీస్టేషన్ పరిధి ప్రగతినగర్ శివారులో జార్ఖండ్‌కు చెందిన వలస కార్మికుడు దీపక్ కుమార్‌యాదవ్(20) శనివారం చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు ఎన్టీపీసీ ప్లాంటులోని కన్వాల్ కంపెనీలో హెల్పర్‌గా పని చేస్తున్నాడు. స్థానిక ప్రగతినగర్ సమీపంలోని లేబర్ క్యాంపులో ఉంటున్నాడు. ఈ ఘటనకు సంబంధించి కారణాలు తెలియాల్సి ఉంది. ఎన్టీపీసీ పోలీసులు ఘటనా స్థలానికి చేసుకోని విచారణ చేపట్టారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు

ప్రశంసాపత్రం అందుకుంటున్న దీకొండ భూమేశ్ కుమార్

సుల్తానాబాద్ రూరల్, డిసెంబర్ 14: పలు అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి ఉత్తమ సేవలకు గుర్తింపు లభించింది. మండలంలోని ఐతరాజ్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దీకొండ భూమేశ్ కుమార్ సేవలను గుర్తించి నేషనల్ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ నెల 15న ఢిల్లీలో నిర్వహించనున్న కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీలో జాతీయ పురస్కరాన్ని ప్రదానం చేయనున్నది. ఈ అ వార్డుకు సహకరించిన నేషనల్ అవార్డు కమిటీ సభ్యుడు బాదె వెంకటేశంతో పాటు సహకరించిన వారికి భూమేశ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

చర్చిని తొలగించాలని వినతి

కాల్వశ్రీరాంపూర్, డిసెంబర్14: పెగడపల్లిలోని ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతి లేకుండా నిర్మించిన చర్చిని వెంటనే తొలగించాలని హిందూ వాహిని నాయకులు ఎమ్మెల్యే విజయరమణారావు కు శనివారం ఫిర్యాదు చేశారు. చర్చిని తొలగించి ప్రభుత్వ భూమి కాపాడాలని కోరారు. కార్యక్రమంలో హిందూవాహిని నాయకులు సాయికుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

ఓదెల, డిసెంబర్ 14: ఫార్చ్యూన్ మెడికేర్ హాస్పిటల్ సౌజన్యంతో ఓదెలలోని వివేకానంద విద్యాలయంలో శనివారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ బోడకుంట శంకర్, గీతాంజలి డిగ్రీ కళాశాల కరెస్పాండెంట్ పల్కపాటి రాజేశ్‌కుమార్, లయన్స్ క్లబ్ విజన్ కేర్ వ్యవస్థాక అధ్యక్షుడు పూదరి దత్తాగౌడ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయగా, ఎమ్మెల్యే విజయరమణారావు ప్రారంభించారు. చేశారు. మొత్తం 317మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో క్యాంపు ఇన్‌చార్జి గజవెల్లి గణేశ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కుంగ్‌ఫూ బెల్టుల ప్రధానం

ధర్మారం, డిసెంబర్ 14: ఖిలావనపర్తిలో డ్రాగన్ స్వార్డ్ కుంగ్- ఫూ అకాడమీ నిర్వహించిన గ్రేడింగ్ టెస్ట్‌లో అర్హత సాధించిన వారికి శనివారం బెల్టులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరై కుంగ్ ఫూ క్రీడాకారులకు బెల్టులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఇటీవల లక్షెట్టిపేటలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కుంగ్ -ఫూ టోర్నమెంట్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో అకాడమీ ఫౌండర్ రాజమల్లు, జనరల్ సెక్రటరీ కస్తూరి ప్రవీణ్, ఇన్‌స్ట్రక్టర్ లింగంపల్లి రమేశ్ పాల్గొన్నారు.

త్రీడీ ఆర్టిస్టును అభినందించిన గవర్నర్

త్రీడీ ఆర్టిస్ట్ కృష్ణను అభినందిస్తున్న గవర్నర్

రామగిరి, డిసెంబర్ 14: ప్రముఖ అంతర్జాతీయ త్రీడి ఆర్టిస్టు మంథని జేఎన్‌టీయూలో మెకానికల్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఎస్ఎస్ఆర్ కృష్ణ హైదరాబాద్‌లోని రాజ్ భవన్‌లో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రత్యేకంగా అభినందించారు. కృష్ణ గీసిన త్రీడి చిత్రాలను ఆసక్తిగా తిలకించారు. దాదాపు 40 నిమిషాల పాటు త్రీడి ఆర్ట్ గురించి అడిగి అభినందించారు. మయసభలోని మాయ కొలనును త్రీడిలో చిత్రించి, గవర్నర్ ముందు ప్రదర్శించారు. మహాభారత కాలం నాటి ఈ త్రీడీ ఆర్ట్‌ను అభివృద్ధి చేయాలని రాజ్‌భవన్‌లో కూడా ఒక త్రీడి ఆర్ట్ చేయాలని , వర్క్‌షాపు నిర్వహించాలని గవర్నర్ సూచించారు. కార్యక్రమంలో వెంకట నవీన్, ఉషోదయ సూపర్ మార్కెట్ ఎండీ పాల్గొన్నారు.

చలో అసెంబ్లీని విజయవంతం చేయండి

కమాన్‌పూర్, డిసెంబర్ 14: ఈనెల 17న పంచాయతీ సిబ్బంది న్యాయమైన డిమాండ్ల సాధనలో భాగంగా చేపడుతున్న చలో అసెంబ్లీకి అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు జీపీ ఉద్యోగుల సంఘం నాయకులు శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నిర్వహించాలని కోరారు. తమ హక్కుల సాధనకు సంబందించి జీవోలను సవరించడంతోపాటు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు బర్ల భూమయ్య, మంగ సంతోష్, దుర్గం రాజు, సాగర్ల నరేశ్, రమేశ్, సంతోష్,సాక్షిత్, విజేందర్ తదితరులున్నారు.

ఉన్నత ఆలోచనలతో ముందుకు సాగాలి

పాలకుర్తి, డిసెంబర్ 14: విద్యార్థులు ఉన్నత ఆలోచనలతో ముందుకు సాగాలని ఎంఈవో టీ విమల అన్నారు. మండలంలోని సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె చేస్తున్న కారణంగా శనివారం పుట్నూరులోని కేజీబీవీరి శనివారం సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎంఈవో పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్య అందేలా చూడాలని ఎస్‌వో స్వరూపకు సూచించారు. కార్యక్రమంలొ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన డీఈవో

బహుమతి అందజేస్తున్న డీఈవో

రామగిరి, డిసెంబర్ 14: రామగుండం ఎన్టీపీసీలో మూడు రోజుల పాటు జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలో మండలంలోని ప్రగతి పాఠశాల విద్యార్థులు రూపొందించిన నమూనాలు ప్రదర్శించగా, ఉత్తమ నమూనాలుగా న్యాయ నిర్ణేతలు ఎంపిక చేశారు. ఇందులో జూనియర్ విభాగంలో ఫుడ్, హెల్త్, హైజిన్ జిల్లా స్థాయి ద్వితీయ బహుమతిగా డీ.అంజనశ్రీ, ఎం.వర్షిని, సీనియర్ లెవల్ విభాగంలో మ్యాస్-పార్క్ జిల్లా స్థాయి ద్వితీయ బహుమతిగా బీ.సహస్ర, అంజుమ్, జబీన్‌లకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీఈవో మాధవిలు విద్యార్థులను అభినందించి సర్టిఫికెట్లు బహుమతులు అందజేశారు. ఈ ఉత్తమమైన నమూనాలను ఏర్పాటు చేసిన గైడ్ సత్యనారాయణ, టీచర్లు అపూర్వ, కృష్ణ మూర్తి, రవీందర్లను కరస్పాండెంట్ కేశవరెడ్డి అభినందించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. 8520980099 / 8520874499.
NT-338978-All

PLOT FOR SALE

★ Hyd. హయత్ నగర్,